

కథా కౌముది

# మగవాడు - సి.మనస్విని

(కౌముది-రచన నిర్వహించిన పోటీల్లో ఎంపికైన ఉత్తమ కథ)

"అక్కయ్యంటే మీకు అంతిష్టమా?" అడిగింది స్రవంతి.

పొద్దున ఏడుగంటలైంది. నిద్రలేచి బ్రష్ చేసుకుని వచ్చి టీ.వీ కెదురుగా సోఫాలో కూర్చున్నాడు మూర్తి. రెండు పింగాణీ మగ్గుల్లో కాఫీ తెచ్చి ఒకటి మూర్తికి ఇచ్చి, తన చేతిలో రెండోది ఉంచుకుని, మూర్తి పక్కనే, అతన్ని ఆనుకుని సోఫాలో కూర్చున్నది స్రవంతి. కొంచెం మూడీగా ఉన్నాడు మూర్తి.

"అక్కయ్యంటే మీకు అంతిష్టమా?" అంది స్రవంతి మళ్ళీ.

కళ్ళు ప్రశ్నార్థకంగా చిట్లించి ఓ అరనిమిషం స్రవంతి వైపు చూశాడు మూర్తి.

"ఇవ్వాళ అక్కయ్యతో మీ పెళ్ళి జరిగిన రోజు. నాకు తెలుసా సంగతి" అంది స్రవంతి.

"అవును గుర్తుంది" అన్నాడు మూర్తి.

"అక్కయ్య గుర్తొచ్చిందా?" అడిగింది స్రవంతి

"అవును" అన్నాడు పొడిగా. 'నిజానికి నేను విశాలను మరిచిపోయిందెప్పుడు' అనుకున్నాడు మనసులో.

"విశాల నేనంటే చాలా ప్రేమగా ఉండేది. నన్ను వదిలి ఉండేది కాదు. నాకు ఏ మాత్రం బాధగానీ, అసౌకర్యంగానీ లేకుండా మెలిగేది' అన్నాడు మూర్తి"

"మరి మీరో?" అడిగింది స్రవంతి.

"నాక్కూడా విశాలంటే ప్రాణం. మేం కలిసి బ్రతికింది రెండేళ్ళే అయినా, ఆ కొద్ది రోజులూ ఏదో పరిమళం నన్ను ఆవరించుకుని ఉన్నట్లుండేది. మేం బతికిందే ఒకరి కోసం ఒకరం అన్నట్టు బతికాం. లోకం ఏమైతేనేం అన్నట్లు బ్రతికాం ఆ రెండేళ్ళూ" అన్నాడు మూర్తి గద్గదంగా.

"అక్కయ్య అదృష్టవంతురాలు. ఇంతగా ప్రేమించే భర్తతో గడపగలిగింది" అంది స్రవంతి.

"నిజానికి నేను అదృష్టవంతుణ్ణి. అలాంటి ప్రేమైక మూర్తితో రెండేళ్ళయినా గడపగలిగాను" అని ఓ నిముషం ఆగి 'సారీ స్రవంతీ' అన్నాడు.

"ఎందుకు సారీ చెపుతున్నారు" అంది స్రవంతి.

"విశాల చనిపోయాక ఓ సంవత్సరం నేనెలా బ్రతికానా నాకే తెలీదు. నా జీవితం నిలువునా కోసినట్లయి పోయింది. అయినా మళ్ళీ పెళ్ళికి సిద్ధపడ్డాను. చూశావా, మనిషి ప్రేమను ఎంత తొందరగా మరచిపోతాడు" అన్నాడు మూర్తి.

"జీవితం జీవించి తీరాలి కదా. పోయిన వాళ్ళతో ఎవరూ పోలేరు. వాళ్ళ జ్ఞాపకాలు తీయగా బాధిస్తూనే ఉంటాయి. ప్రేమించిన వాళ్ళను పోగొట్టుకోవడం ఒక బాధాకరమైన సంఘటనగా భావించి ముందుకు సాగాలే కానీ, అక్కడితో జీవితానికి ఫుల్ స్టాప్ పెట్టలేంకదా' అంది స్రవంతి. 'నాకు సారీ ఎందుకు చెప్పారు, చెప్పనే లేదు' అంది ప్రశ్నార్ధకంగా.

"నేను వేరే స్త్రీని గురించి ఆలోచిస్తుంటేనూ, గుర్తు చేసుకుంటుంటేనూ, మా ప్రేమను గురించి మాట్లాడుతుంటేనూ నీకు ఏమీ అనిపించడంలేదా?" అన్నాడు మూర్తి.

"ఛ ఛ ఎందుకనిపిస్తుంది. అక్కయ్యా మీరూ ప్రేమించుకున్నారు. పెళ్ళిచేసుకున్నారు. ఆనందంగా గడిపారు. దురదృష్టవశాత్తూ అక్కయ్య చనిపోయింది ఆ జ్ఞాపకాలు మననం చేసుకోవడంలో తప్పేముంది. అసలు వాటిని ఎందుకు మరచిపోవాలి. నాకేమీ ఈర్ష్య లేదు. నిజం చెప్పాలంటే విశాలక్కంటే ఎంతో గౌరవం కలుగుతున్నది. మీరు ఆమెను మరచిపోలేకపోవడం న్యాయమే. సహజమే" అంది స్రవంతి.

"కాని అవే జ్ఞాపకాలు పదే పదే తలచుకోవడం ఎందుకు. అదంతా గతం. నువ్వు నాకు దొరికావు. మనిద్దరం కూడా ప్రేమగానే ఉన్నాం. నిజంగ నీ సాన్నిధ్యంలో ఉన్నప్పుడు విశాల సంగతే జ్ఞాపకమ్రాదు. మన పెళ్ళైన కొత్తలో కొన్ని రోజులు పదే పదే గుర్తొచ్చేది. కాని ఇప్పుడు, నువ్వు నా బతుకులో భాగమైపోయాక చాలా తక్కువ సార్లు గుర్తొస్తుంది" అన్నాడు మూర్తి. స్రవంతి మనసు ప్రఫుల్లమైంది.

"అన్నట్టు అక్కయ్య ఫోటో ఎక్కడా లేదే?" అంది స్రవంతి.

"ఏంటో రోజూ ఎదురెదుగ్గా కూచుని గడిపే వాళ్ళం. ఫోటోలు ఆల్బంలో చాలా ఉన్నాయిగాని, ఎప్పుడూ ఓ ఫోటో ప్రత్యేకంగా ఎన్‌లార్జి చెయ్యించలేదు. ఇక ఇప్పుడు ఆ అవసరం కూడా లేదు" అన్నాడు మూర్తి.

"ఆల్బం ఎక్కడుంది?" అడిగింది స్రవంతి.

"పాత సామాన్ల రూంలో ఎక్కడో ఉండాలి! అన్నాడు మూర్తి. ఖాళీ మగ్గులు తీసుకుని లోపలికి వెళ్ళింది స్రవంతి." 'స్నానం చెయ్యండి టిఫిన్ రెడీ చేస్తాను' అంటూ

"అన్నట్టు మీ కొత్త బాస్ ఎట్లా ఉన్నాడు" అని అడిగాడు మూర్తి.

"నిన్ననే కదా ఆయ ఛార్జి తీసుకుంది. ముందు ముందుకానీ తెలియదు' అంది స్రవంతి వంటింట్లోంచి.

స్రవంతి చేసే ఆఫీసుకు ఐదురోజుల వారం అంటే శని ఆదివారాలు శలవలు. మూర్తి ఆఫీసుకు మాత్రం ఆదివారమే శలవు. ఉదయమే స్కూటర్ మీద ఇద్దరూ ఆఫీస్‌కు వెళతారు. సాయంకాలం వస్తూ స్రవంతిని పికప్ చేసుకుని వస్తుంటాడు మూర్తి. వాళ్ళకింకా పిల్లలు లేరు.

ఒకరోజు శనివారం మూర్తి ఇంటికి వచ్చేసరికి ఇల్లు బూజు తుడుస్తున్నది స్రవంతి. మూర్తిరాగానే పని ఆపేసింది. మూర్తి తన హాండ్ బ్యాగ్ రూంలో పడేసి, లుంగీలోకి మారి మొహం కడుక్కోడానికి బాత్రూం లోకి వెళ్ళాడు. మొహం తుడుచుకుంటూ బయటకు వచ్చి సోఫాలో కూర్చోగానే వేడి వేడి టీ రెండు గ్లాసుల్లో పోసుకొచ్చి తనోటి ఉంచుకుని, మూర్తి పక్కనే సోఫాలో కూర్చుంది స్రవంతి.

టీ చప్పరించి "టీ ఫస్ట్‌గా ఉంది ఇవ్వాళ. ఏం కలిపావు దీన్లో?" అన్నాడు మూర్తి.

"శబరిలాగా ముందుగా నేను రుచి చూసి తెచ్చాను నీగ్లాసు. అందుకే బాగుండుండాలి" అని తానూ ఒక గుక్క చప్పరించి 'కలిసి తాగితే ఉన్న మజా - అది అనుభవించితే తెలియనులే' అని పాడింది.

"యమా హుషారుగా ఉన్నావ్. ఏమైనా విశేషమా?" అన్నాడు మూర్తి 'విశేషమా' అనే పదాన్ని 'టంగిన్ - చీక్' గా ఉచ్చరిస్తూ.

"ఛీ. ఎప్పుడూ తిక్కల మాటలేనా!?" అంది స్రవంతి

"విశేషం అనే మాటలో అంత విశేషమే ముందోయ్. అట్లా ఇదైపోతావు. అయినా విశేషం అనగానే చింతకాయలూ, పుల్లమామిడికాయలే గుర్తుకు రావాలా ఆడవాళ్ళకు" అన్నాడు మూర్తి. స్రవంతి నవ్వింది.

ఓ చిన్నముద్దుల సీను పూర్తయ్యాక, "అదుగో అటు చూడు" అంది స్రవంతి షోకేస్ పక్కనే ఉన్న గోడను చూపిస్తూ. చూశాడు మూర్తి.

విశాల ఫోటో గోడకు తగిలించి ఉంది. ఓ ప్లాస్టిక్ మల్లెపూల దండ ఒంటిపేటది వేసివుంది దానికి. అమాయకమైన మొహంతో నవ్వుతూ చూస్తున్నది విశాల. ఆశ్చర్యపోయాడు మూర్తి. ప్రసన్నత నిండిన మొహంతో 'నేను గమనించలేదు. ఎక్కడిదా ఫోటో?' అని అడిగాడు.

"ఆల్బం లోంచి తీసి నేనే ఎన్‌లార్జ్ చేయించా" అంది స్రవంతి.

'థాంక్స్' అన్నాడు మూర్తి.

"యూ ఆర్ మోస్ట్ వెల్కం" అంది స్రవంతి.

రెండు నిముషాలు మౌనంగా ఉన్నాడు మూర్తి. తర్వాత స్రవంతిని దగ్గరకు పొదువుకుని "ఇప్పుడు మనం సంతోషంగా ఉన్నాం. మన మధ్యకు ఇతరులు రావడం అవసరమా స్రవంతీ?" అన్నాడు మూర్తి.

"విశాలక్క కూడానా?" అడిగింది స్రవంతి.

"అవును విశాల కూడా" అన్నాడు మూర్తి.

"విశాలక్క ఇప్పుడు బ్రతికిలేదు కదండీ, మన బ్రతుకుల మధ్యకు వచ్చి ఏమైనా చెయ్యడానికి. ఆమె జ్ఞాపకాలే కదా ఉన్నాయి. ఆ జ్ఞాపకాలు సంతోషకరమైనవేగాని బాధగా స్మరించుకోవలసినవి కాదుకదా. ఆమె మీతో రెండేళ్ళు ఆ విధంగా మీ జీవితంలో ఓ భాగమై పోయింది. ఆ భాగాన్ని పాత సామానుల గదిలో ఉంచి తలుపెయ్యాల్సిన పనేముంది. ఆమెను మీరు గుర్తుచేసుకుంటుంటే మన కాపురంలో ఇబ్బందులు వస్తాయా? మీరు ఆమెను మర్చిపోవలసిన అవసరంగానీ నేను ఆమెను ద్వేషించాలిసిన అవసరం గానీ ఏముంది చెప్పండి" అంది స్రవంతి.

మూర్తి ఎంతో ప్రసన్నంగా తన దోసిట్లోకి స్రవంతి ముఖాన్ని తీసుకుని, ఆమె కళ్ళల్లోకి చూస్తూ 'యు ఆర్ గ్రేట్' అన్నాడు. "అంతేనా, మరేంలేదా" అంటూ తన పెదాల్ని మూర్తి ముఖం దగ్గరికి జరిపింది స్రవంతి.

ఓ పదిరోజుల తరువాత అలాగే సంతోషంగా మాట్లాడుకుంటున్నారు స్రవంతీ, మూర్తీ అదే సోఫా మీద కూర్చుని. కొంచెం సేపైనాక ఉన్నట్టుండి విశాల ఫోటో వైపు చూసిన మూర్తి ఆశ్చర్యంతో కొయ్యబారిపొయ్యాడు. ఓ నిమిషం నోటమాటరాలేదు. విశాల ఫోటో పక్కనే మరో ఫోటో - ఓ యువకుడిది ప్రత్యక్షమైంది. అందంగా ఉన్నాడు ఆ ఫోటోలో ఉన్నతను. స్టైల్ గా నవ్వుతున్నాడు. ఆ

ఫోటోలో ఉన్న వ్యక్తిని మూర్తి ఎప్పుడూ చూడలేదు గానీ, అతనెవరో ఊహించాడు. ఏమీ మాట్లాడలేదు మూర్తి, అతన్నే గమనిస్తున్న స్రవంతి అన్నది 'అతను శేఖర్' అని. మూర్తి తన మొహం అలాగే గడ్డకట్టినట్లు కూర్చున్నాడు ఏమీ మాట్లాడలేదు.

"మీరు విశాలక్కను ఎంత గాఢంగా ప్రేమించాను. విశాలక్క మిమ్మల్ని ప్రేమించినట్లే శేఖరూ నన్ను ప్రేమించాడు. ఒక రెండేళ్ళు అన్యోన్యంగా గడిపాం. ఉన్నట్టుండి ఆక్సిడెంట్‌లో పోయాడు శేఖర్" అన్నది స్రవంతి. తన గొంతులో ఏ భావమూ కనిపించనీయకుండా, మాటర్ ఆఫ్ ఫాక్ట్‌గా చెపుతూ తన ఆనాటి రోజుల జ్ఞాపకాల భావోద్వేగాలు గొంతులో కానీ, ముఖంలో కానీ కనిపించకుండా ఉండేందుకు జాగ్రత్త పడుతూ.

మూర్తి తలదించుకునే ఉన్నాడు ఏ భావమూలేని ముఖంతో, స్రవంతి వైపు చూడడంలేదు. స్రవంతి కొనసాగించింది.

"అప్పుడే మనకు పరిచయమైంది. నా శ్రేయోభిలాషులూ మీ మిత్రులూ మనకు పరిచయం కల్పించారు. మనం పరస్పరం అర్థం చేసుకోవడానికి ఓ నెలరోజులు కలిసి తిరిగాం. పార్కుల్లో కూచుని ఒకరి విషయాలొకరం తెలుసుకున్నాం. నేను భర్తపోయిన యువతినని మీకు తెలుసు. మీ భార్య అంతకు ముందు దాదాపు ఏడాది క్రితం పోయిందని నాకు తెలుసు. మనం ఒకరినొకరం ఇష్టపడ్డాం. పెళ్ళి చేసుకున్నాం. ఎంతో ప్రేమగా సంతోషంగా జీవిస్తున్నాం" అన్నది స్రవంతి.

'ఔనౌను' అన్నాడు మూర్తి పొడిపొడిగా లేచి లోపలకి వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత ఐదారు రోజులు మూర్తి ముభావంగానే ఉన్నాడు. సమయానికి కాఫీలు, టిఫిన్లూ, స్నానపానాలు అమరిపోతూనే ఉన్నాయి. కానీ ఓ నిశ్శబ్దం తాండవిస్తూనే ఉన్నది ఇంట్లో. స్కూటర్ మీద కలిసి ఆఫీసుకు పోతున్నారు, వస్తున్నారు. కానీ అదే ముభావం వారిద్దరి మధ్య. కారణం ఏమిటో ఇద్దరికీ తెలుసు. ఆ పరిస్థితి ఇద్దరికీ బాగోలేదు. మూర్తికి గిల్టీఫీలింగు, ఆ ఫీలింగును అధిగమించలేని అశక్తతా.

ఒక రోజు కాఫీ గ్లాసు అందిస్తూ, తనూ సోఫా మీదే కూర్చుని మూర్తిని స్రవంతి. 'మనింట్లో అప్రకటిత కర్ఫ్యూ కొనసాగాల్సిందేనా' అని.

ఒక జీవంలేని నవ్వు నవ్వి తలెత్తి స్రవంతిని చూసి – ఆ తర్వాత విశాలా వాళ్ళ ఫోటో వైపు చూశాడు మూర్తి యధాలాపంగా. ఈసారి ఇంకా ఆశ్చర్యపోయాడు. శేఖర్ ఫోటో అక్కడ లేదు. విశాలది మాత్రమే ఉంది. ప్రశ్నార్థకం మొహంతో స్రవంతి వైపు చూశాడు.

"నేనే తీసి బయట పారేశాను" అంది స్రవంతి. మూర్తి కొంచెం సేపు ఏమీ మాట్లాడలేదు. తర్వాత 'సారీ స్రవంతి' అన్నాడు.

"విశాలను నీవు గుర్తించుకోవచ్చు. ఆమె ఫోటోను ఎదురుగా ఉంచుకుని ఆమెతో గడిపిన రోజులను ఆనందంగా, ఆత్మీయంగా తలచుకోవచ్చు. నాకు వినిపించవచ్చు. అందుకు నాకేమీ ఈర్ష్యలేదు. కోపం లేదు. కానీ శేఖరూ నా జీవితంలో ఓ మూడేళ్ళ అందమైన అనుభలకు భాగస్వామి. అతన్ని నేను తలచుకోకూడదు. ఇంట్లో అతని ఫోటో ఒక భయంకర నిశ్శబ్దశైవత్యానికి కారణం అవుతుంది. ఏం, ఎందుకు? అని నేను వాదించొచ్చు. కాని ఆ వాదన నా ముందు జీవితానికి కారు మబ్బౌతుంది. నేనే అడ్జస్టయి తీరాలి – ఎందుకంటే నేను ఆడదాన్ని కనక" అని చెప్పాలనుకుంది. కానీ చెప్పలేదు.

"వెరీసారీ స్రవంతీ, నన్ను మన్నించు. మనిద్దరి మధ్యకూ మరెవర్నీ తీసుకురాకు. ప్లీజ్." అని – లేచి విశాల ఫోటోను తొలిగించబోయాడు మూర్తి.

"వద్దొద్దు. దాన్ని తీయకు. అక్కడే ఉంచు" అంది. స్రవంతి

"వద్దు స్రవంతీ, దీని స్థానం స్టోర్ రూంలోనే" అంటూ విశాల ఫోటోను తొలిగించాడు మూర్తి.

ఆ ఫోటోను చూసినప్పుడల్లా తన బుద్ధిలోని కొంచెపుతనం అతన్ని ఎగతాళి చేస్తూ ఉంటుందని స్రవంతికి తెలుసు.

"మగవాడు" అని నిట్టూర్చింది స్రవంతి.